సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 21 । నవంబర్ । 2023



అమ్మచేతి వంటతో ఆరోగ్యం

అమ్మచేతి వంట ఆరోగ్యానికి ఎంతో మేలని ఉన్నత భారతి అభియాన్ తెలంగాణ ప్రాజెక్ట్ డైరెక్టర్ శరత్‌చంద్ర నవీన్‌కుమార్ అన్నారు.

- 2లో ▸



నా కట్టె కాలేది బాన్సువాడలోనే..

తాను మృతిచెందితే కట్టె కాల్చేది బాన్సువాడ నియోజకవర్గంలోని పోచారంలోనేనని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

- 2లో ▸

గరిష్టం/కనిష్టం
33.1 /20.1

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మబ్బుపట్టి ఉండవచ్చు. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రచారంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

బోధన్‌రూరల్(బోధన్) : బోధన్ మండలంలోని పెంటాకుర్దు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. సోమవారం మండలంలోని పెంటాకుర్దులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీమంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ గ్రామంలో పర్యటించారు. అదే సమయంలో బీఆర్‌ఎస్ నాయకులు సైతం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు ఎదురుపడటంతో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఇరుపార్టీల నాయకులు వాగ్వాదం చేసుకుని ఒకరినొకరు తోసుకుంటూ ఘర్షణకు దిగారు. సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను నిలువరించారు. ఈ ఘటనపై ఎన్నికల సంఘం అధికారులు వివరాలు సేకరించి విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

కారు అద్దం ధ్వంసం

- పోలీసుల దుశ్చర్యపై ఆగ్రహం



ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బార్ సమీపంలో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు ఓ కారు అద్దాన్ని ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మణ్‌యాదవ్ అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి భైంసాకు కుటుంబసభ్యులతో కలిసి శుభకార్యానికి వెళ్తున్నారు. బైపాస్ నుంచి ఆయన కారులో వెళ్తుండగా ఒక బార్ వద్ద పోలీసులు తనిఖీల కోసం కారును ఆపేందుకు ప్రయత్నించగా ఆయన కారును కొద్దిగా ముందుకు తీసుకెళ్లి ఆపారు. దీంతో పోలీసులు కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులతో లక్ష్మణ్‌యాదవ్ అరగంటసేపు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్ లక్ష్మణ్‌యాదవ్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

అపరిచితుల ఎస్సెమ్మెస్‌లకు స్పందించవద్దు

ఖలీల్‌వాడి : గుర్తుతెలియని వ్యక్తుల సెల్‌ఫోన్ల నుంచి ఎస్సెమ్మెస్‌లు వస్తే వాటికి స్పందించవద్దని సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో అనుమానంగా ఉన్న ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను యాక్సెప్ట్ చేయవద్దన్నారు. ఈ సందర్భంగా సోమవారం ప్రకటన విడుదల చేశారు. గుర్తు తెలియని అమ్మాయిలు కాల్ చేసి కవ్వింపు చర్యలకు పాల్పడితే స్పందించవద్దన్నారు. వాట్సప్ వీడియోకాల్స్ చేస్తే కూడా రిప్లై ఇవ్వవద్దన్నారు. సైబర్ బాధితులైతే వెంటనే క్రైం టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేయాలని, www.cybercrime.gov.inలో రిపోర్టు చేయాలని తెలిపారు.

నేడు, రేపు ఎన్నికల అధికారులకు శిక్షణ

డిచ్‌పల్లి : రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కేటాయించబడిన పీవో, ఏపీవో, ఓపీవోలకు ఈ నెల 21, 22వ తేదీల్లో నగరంలోని గిరిరాజ్ పీజీ కళాశాలలో రెండవ విడత శిక్షణ ఉంటుందని ఆర్‌వో రాజేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరంతా తమ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని పైన తెల్పిన శిక్షణ శిబిరం వద్ద వినియోగించుకోవాలన్నారు. అలాగే ఎన్నికల విధులలో పాల్గొననున్న పోలీస్ అధికారులు, అత్యవసర సేవల సిబ్బంది, ఇతర అధికారులు (సెక్టార్ ఆఫీసర్స్, డ్రైవర్స్, కండక్టర్లు) కూడా (పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసిన వారు) నిజామాబాద్ ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌ను ఈ నెల 23 నుంచి 25వ తేదీ సాయంత్రం 5గంటల లోపు వినియోగించుకోవచ్చన్నారు. ఈనెల 21, 22వ తేదీల్లో శిక్షణ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించని వారు ఆర్డీవో ఆఫీస్‌లోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్‌ను ఈ నెల 23 నుంచి 25వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఆర్మూర్‌టౌన్: రోటరీ క్లబ్‌ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో రూపొందించిన 'ఓటు వజ్రాయుధం' కరపత్రాలను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు విద్యా గోపి, పట్వారి తులసీ, కాంతి గంగారెడ్డి, ప్రవీణ్‌పవార్, శశిధర్ పాల్గొన్నారు.



కంఠేశ్వరాలయంలోని కోనేరు వద్ద దీపోత్సవం

కనులవిందుగా దీపోత్సవం





నీలకంఠేశ్వరాలయంలో దీపారాధనలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత, మహిళలు

జిల్లాలో శివాలయాలు సోమవారం కార్తీక దీపకాంతులతో వెలిగిపోయాయి. శైవక్షేత్రాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. ఆలయ ప్రాంగణాల్లో ఉసిరి, తులసీకోటల ఎదుట మహిళలు దీపాలు వెలిగించి మంగళహారతులు ఇచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నగరంలోని శంభునిగుడి, నీలకంఠేశ్వర ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. కంఠేశ్వర్ ఆలయంలో ఎమ్మెల్సీ కవిత పూజలు నిర్వహించారు. - నిజామాబాద్ సిటీ

మరిన్ని వివరాలు 04లో..

పోలింగ్ సరళిని పరిశీలించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పక్కన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- మైక్రో అబ్జర్వర్లకు శిక్షణా తరగతులు
- సూచనలు చేసిన జనరల్ అబ్జర్వర్లు

సుభాష్‌నగర్ : ఎన్నికల్లో ఓటింగ్ ప్రక్రియ ముఖ్యమైందని ఈ కార్యక్రమాన్ని నిశితంగా అధికారులు పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. పోలింగ్‌కు సంబంధించి మైక్రో అబ్జర్వర్లకు సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. సాధారణ పరిశీలకులు గౌతమ్ సింగ్, సుబ్రా చక్రవతి, లలిత్ నారాయణ్ సింగ్ సందు కార్యక్రమానికి విచ్చేసి మైక్రో అబ్జర్వర్లకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరు సెగ్మెంట్ల పరిధిలో 500 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. ప్రతిఒక్కరూ ప్రతిచిన్న అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు ఉదయం 7 గంటలకే డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకొని పోలింగ్ సిబ్బందికి సామగ్రి సక్రమంగా అందించారనేది పరిశీలించాలన్నారు. ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 గంటలకే మాక్‌పోల్ ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు. ఈవీఎంలు పని చేయకుంటే తక్షణమే వాటిని మార్చకూడదని, ఈసీఐఎల్ ఇంజినీర్లు పరిశీలించిన తర్వాతే వేరే ఈవీఎంలు వినియోగించాలని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులు నిర్వర్తిసున్న విధులను గమనించాలని, టెండర్, ఛాలెంజ్ ఓటింగ్ జరిగితే వాటి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పోలింగ్ ప్రారంభం నుంచి పూర్తయ్యేంత వరకు అన్ని అంశాలు గమనిస్తూ, ఎప్పటికప్పుడు వాటిని జనరల్ అబ్జర్వర్ల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

ఒకరికి మాత్రమే అనుమతి

ప్రతి పార్టీ తరఫున ఇద్దరు ఏజెంట్లను నియమించనుండగా, పోలింగ్ కేంద్రాల్లో ఒక్కరిని మాత్రమే అనుమతించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై, సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఐదు గంటల్లోపు పోలింగ్ కేంద్రంలో ఉన్నవారికి మాత్రమే ఓటింగ్ అవకాశం ఇవ్వాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాగా, పోస్టల్ బ్యాలెట్‌ను మైక్రో అబ్జర్వర్లు వినియోగించుకోవాలని, రెండోవిడత శిక్షణ కేంద్రాల వద్ద, అలాగే రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్‌రావు, మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ సజావుగా చేపట్టాలి



కార్యాలయంలో సమీక్షిస్తున్న జీఎం భాస్కర్..

సుభాష్‌నగర్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు లేకుండా సేకరణ సజావుగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ భాస్కర్ సూచించారు. సోమవారం సీఎంఆర్ అప్పగింత, గన్నీ బ్యాగుల సరఫరా, రైతులకు ఆన్‌లైన్ పేమెంట్, తదితర అంశాలపై డీఎస్‌ఓ చంద్రప్రకాశ్, డీఎం జగదీష్‌కుమార్‌తో కలిసి సమీక్షించారు. అనంతరం నవీపేట్, నిజామాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్లు, జాన్కంపేట్‌లోని గన్నీ బ్యాగుల గోదామును పరిశీలించి పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఓపీఎంఎస్ చేస్తే రైతులకు డబ్బులు త్వరగా వస్తాయన్నారు. కొనుగోళ్లలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) గడువులోగా అప్పగించే విధంగా రైస్‌మిల్లర్లపై ఒత్తిడి తేవాలని, మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. ధాన్యం డబ్బులు ఓపీఎంఎస్ చేసిన వెంటనే చెల్లిస్తున్నామన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ, గన్నీ బ్యాగులు, ధాన్యం రవాణా, తదితర అంశాలను జీఎంకు వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో సమావేశమైన భాస్కర్ కొనుగోలు కేంద్రాలు, పలు విషయాలపై చర్చించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

లిఖితపూర్వకంగా..

ఎన్నికల ప్రచారంలో భాగంగా హామీలు ఇస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కుల సంఘాలకు, కాలనీల అభివృద్ధి కమిటీలకు హామీ పత్రాలు సైతం రాసిస్తున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ అభ్యర్థులు ఎన్నికల కోడ్ రాకముందే కులసంఘాలకు, కమ్యూనిటీ భవనాలకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారు.



ఓటర్లకు నమ్మకం కలిగించేలా..

- హామీ పత్రాలు రాసిస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు
- కులసంఘాలు, కాలనీల అభివృద్ధి కమిటీలతో విస్తృత సమావేశాలు
- కోడ్ రాకముందే ప్రొసీడింగ్స్ ఇచ్చిన అధికార పార్టీ అభ్యర్థులు

జంగ్ తెలంగాణ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎన్నికల నేపథ్యంలో హామీల వర్షం కురిపిస్తున్న అభ్యర్థులు పంథా మార్చారు. ఇస్తున్న హామీలకు సంబంధించి కొందరు అభ్యర్థులు కొన్ని చోట్ల బాండ్ పేపర్లు, హామీ పత్రాలు రాసిస్తున్నారు. జిల్లాలోని కొందరు అభ్యర్థులు పలు సంఘాలకు ఇలాంటి హామీ పత్రాలు రాసి ఇవ్వడం విశేషం. ముఖ్యంగా కులసంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు ప్రాంతాలవారీగా నిర్వహిస్తున్న అభ్యర్థులు ఆయా ఓట్లను గంపగుత్తగా దక్కించుకునే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. కులసంఘాలకు సంబంధించి నియోజకవర్గాల్లో ప్రాంతాలవారీగా ఉన్న సంఘాలతో, నిజామాబాద్ నగరంలో తర్పలవారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని మాట్లాడుతున్నారు. ఇందులో భాగంగా ఇచ్చిన హామీలకు సంబంధించి కొన్ని చోట్ల అభ్యర్థులు హామీ పత్రాలు రాసిస్తున్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన సిట్టింగ్ అభ్యర్థులు మాత్రం ఎన్నికల కోడ్ రాకముందే కులసంఘాలకు, కమ్యూనిటీ భవనాలకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారు. తరువాత కూడా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో హామీ పత్రాలు రాస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పలు చోట్ల పలు సంఘాలకు హామీలు ఇస్తూ వెళ్తున్నారు. పోటాపోటీగా అభ్యర్థులందరూ హామీలు ఇస్తుండడంతో పాటు ఏకంగా హామీ పత్రాలు సైతం రాసిస్తుండడం పట్ల ఓటర్లు నిశితంగా గమనిస్తున్నారు. అలాగే వివిధ కాలనీలకు ప్రత్యేకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేయిస్తామని చెప్పి కాలనీ కమిటీలకు హామీ పత్రాలు రాసి ఇస్తుండడం గమనార్హం.

పసుపు బోర్డుపై..

గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు సాధిస్తానని ప్రకటించిన ధర్మపురి అరవింద్ ఏకంగా బాండ్ పేపర్ రాసిచ్చి మరీ ఎన్నికల్లో బరిలోకి దిగి ఎంపీగా విజయం సాధించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరుగుతున్న శాసనసభ ఎన్నికలకు సంబంధించి హామీ పత్రాలు రాసివ్వాల్సిన ఆవశ్యకత నెలకొనడం గమనార్హం. ఇటీవల నిజామాబాద్ పర్యటనకు వచ్చిన నరేంద్రమోదీ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో బాండ్ పేపర్ రాసిచ్చే సంస్కృతికి ప్రాధాన్యం ఏర్పడింది. తాజాగా జరుగుతున్న శాసనసభ ఎన్నికలకు సంబంధించి పలు చోట్ల హామీ పత్రాలు రాసిచ్చే కల్చర్‌కు మరింత ఊతమిస్తోంది. కులసంఘాల ఓట్లను గంపగుత్తగా దక్కించుకునే ఉద్దేశంతో అభ్యర్థులు అనేక పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలోనే హామీ పత్రాలు రాసిస్తున్నారు. ఏవిధంగానైనా గెలిచి తీరాలనే లక్ష్యంతో అభ్యర్థులు హామీ పత్రాలు రాసిచ్చేందుకు ఉత్సాహం చూపుతుండడం విశేషం.

ఆయూష్ సేవలను ప్రజలకు చేరువ చేయాలి

నిజామాబాద్ నాగారం : జిల్లాలో ఆయూష్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఆయూష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవినాయక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పెద్ద బజార్‌లో ఉన్న ఆయూష్, యునాని ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆయూష్, యునాని సేవలపై క్యాంపులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఆయూష్ ఇన్‌చార్జి వైద్యుడు రమణమోహన్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ఆయూష్ సేవలను ప్రజలకు మరింత చేరువయ్యేలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూష్ మెడికల్ సీనియర్ ఆఫీసర్ ఫసీయొద్దీన్, డాక్టర్ లక్ష్మణ్‌రావు, డాక్టర్ వెంకటేష్, పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.




జిల్లా ఆయూష్ ఆస్పత్రిలో పరిసరాలను శుభ్రం చేస్తున్న వైద్యులు

శాంతియుతంగా పరిపాలన చేస్తాం

- గంజాయి రహిత నియోజకవర్గంగా మారుస్తాం
- గ్రామాల్లో అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తాం
- ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరిస్తాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్ రెడ్డి

తెలంగాణ ఆవిర్భావం తర్వాత బాల్కొండ నియోజకవర్గంలో అసాంఘిక శక్తుల వల్ల శాంతియుత వాతావరణం దెబ్బతింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రజలతో మమేకమై శాంతియుత వాతావరణం నెలకొనేలా కృషి చేస్తాను. అలాగే నియోజకవర్గాన్ని గంజాయి రహిత ప్రాంతంగా మారుస్తాను'' అని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై సమాధానాలిచ్చారు.

– మోర్తాడ్ (బాల్కొండ)



✤ బాల్కొండ నియోజకవర్గం ప్రజలకు మీరిచ్చే హామీలేమిటి..?

■ నియోజకవర్గంలో 2014కు ముందుగానే ఎంతో అభివృద్ధి జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం, గట్టుపొడిచిన వాగు ప్రాజెక్ట్, రాళ్లవాడు ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది. సాగునీటి సమస్యను అప్పట్లోనే పరిష్కరించారు. ఈ పథకాలను సక్రమంగా వినియోగిస్తూ రైతులకు సాగునీటి సమస్య లేకుండా చేస్తాం. బీసీ గురుకులం, మైనార్టీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాల్లేవు. ఉన్న అద్దె భవనాల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గురుకుల స్కూళ్లకు సొంత భవనాలను నిర్మించి విద్యార్థులకు ఉత్తమమైన చదువు, వసతి మంచి భోజనం అందిస్తాం. నియోజకవర్గం ప్రజలు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కోసం ఎమ్మెల్యే కోసం పడిగాపులు కాస్తున్నారు. ఇలా కాకుండా స్థానిక ఉద్యోగుల ద్వారా దరఖాస్తులు సేకరించి పనిపూర్తయ్యేలా చూస్తాం.

✤ యువతకు మీరు ఇచ్చే హామీలు ఏమిటి?

■ యువతకు, నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన జాబ్ క్యాలెండర్ అమలు చేయడానికి కట్టుబడి ఉంది. యువత చెడ్డదారిలో పోకుండా చదువుపై మనస్సును నిలిపి పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగ అవకాశాలు విస్తృతం చేయనున్నాం. ప్రైవేటు రంగంలోనూ ఉపాధి కల్పించడానికి నేను సొంతంగా కృషి చేస్తాను. యువత మేధస్సును పరిపూర్ణంగా వినియోగించుకుంటూ నియోజకవర్గం అభివృద్ధికి యువత కుటుంబాలకు చేయూతను ఇవ్వడానికి కృషి చేస్తాం.

✤ మహిళల కోసం ఏమైనా ప్రత్యేక పథకాలను అమలు చేస్తారా?

■ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే కర్ణాటక రాష్ట్రంలో అధికారం చేపట్టి మహిళల కోసం అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది. మన రాష్ట్రంలో కూడా అదేవిధంగా ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి నెలా రూ.2,500ల సాయం, ఆసరా పింఛన్ మొత్తాన్ని పెంచడం, బీడీ కార్మికులకు పీఎఫ్ కటాఫ్ తేదీ ఎత్తివేసి పింఛన్‌లను అందిస్తాం.

✤ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తారా..? అమలు చేస్తారా..?

■ నేను రాజకీయాల్లోకి వచ్చిన పదేళ్ల నుంచి నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉన్నాను. నియోజకవర్గంలో ఏ ఒక్క కుటుంబానికి సమస్య వచ్చినా నా కుటుంబ సమస్య అని భావించి నాకు తోచిన విధంగా సాయం చేశాను. ఇదే విధానం ఇంకా కొనసాగిస్తాను. బాల్కొండ ఎమ్మెల్యేగా గెలిస్తే బాధ్యత మరింత పెరుగుతుంది.

సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తాం. నియోజకవర్గం ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ వారిని కంటికి రెప్పలా కాపాడుకోవడం నా ప్రధాన బాధ్యత. బాల్కొండ నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా రాష్ట్రంలో గుర్తింపు పొందేలా కృషి చేస్తాం.

✤ నియోజకవర్గంలో చేపట్టబోయే ప్రత్యేక కార్యక్రమాలేమిటి.?

■ నియోజకవర్గంలో 2014కు ముందు శాంతియుత వాతావరణం ఉండేది. తెలంగాణ ఆవిర్భవించాక కొందరు రాజకీయ నాయకుల తీరుతో అలజడి పెరిగింది. గంజాయి మత్తుకు యువత బానిసలయ్యారు. అన్ని చోట్లా శాంతియుత వాతావరణం దెబ్బతింది. ముఖ్యంగా మహిళలు ఇబ్బందికరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మేం గెలిస్తే నియోజకవర్గంలోని ప్రజలతో మమేకమై శాంతియుత వాతావరణం నెలకొల్పుతాం. గంజాయి రహిత నియోజకవర్గంగా మారుస్తాం. యువతకు ఉపాధి చూపి, మహిళలకు రక్షణ కల్పిస్తాం.

✤ రైతుల కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలేమిటి..?

■ కాంగ్రెస్ మేనిఫెస్టోలో వ్యవసాయానికి ఊతమిచ్చేలా హామీలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏకకాలంలో రూ. 2 లక్షల పంటరుణం మాఫీ చేయడంతో పాటు రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి ఏడాదికి రూ. 15 వేల పెట్టుబడి సాయం అందిస్తాం. అలాగే వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల సాయం అందించడానికి ఏర్పాట్లు చేస్తాం. వరి ధాన్యానికి రూ. 500ల బోనస్‌ను అందిస్తాం. నియోజకవర్గంలో ఎక్కువగా సాగుచేసే పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించడానికి కూడా కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తుంది.

✤ గల్ఫ్ వలస కార్మికుల కోసం ఎలాంటి కార్యాచరణ ఏర్పాటు చేశారు.

■ వాస్తవానికి బాల్కొండ నియోజకవర్గంలో గల్ఫ్ వలస కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామని స్పష్టంగా హామీ ఇచ్చాం. వలస కార్మికులకు వారి కుటుంబాలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నతమైన సంక్షేమ పథకాలను వలస కార్మికులకు అందిస్తుంది. వలస వెళ్లేవారికి వారు ఎంచుకున్న రంగంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించి మెరుగైన ఉపాధి కోసం కృషి చేస్తాం.

క్లుప్తంగా

ఇంటర్‌ యూనివర్సిటీ పోటీలకు తెయూ జట్టు



తెయూ(డిచ్‌పల్లి): తమిళనాడు రాష్ట్రం అలగప్ప యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 26 వరకు జరగనున్న సౌత్‌ జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు సోమవారం తెలంగాణ యూనివర్సిటీ మహిళా కబడ్డీ జట్టు వెళ్లింది. ఈ సందర్భంగా వర్సిటీ క్రీడావిభాగం డైరెక్టర్‌ జి బాలకిషన్‌ మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, యూనివర్సిటీకి పేరు తేవాలని సూచించారు. జట్టు కోచ్‌గా సంధ్య,మేనేజర్‌గా సురేష్‌ వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. వర్సిటీ ఫిజికల్‌ డైరెక్టర్‌ బీఆర్‌ నేత పాల్గొన్నారు.

ఖోఖో పోటీలు



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జూనియర్‌ విభాగంలో జిల్లాస్థాయి పోటీలు సోమవారం పాత కలెక్టరేట్‌ మైదానంలో నిర్వహించారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ జనరల్‌ సెక్రెటరీ లింగయ్య, జిమ్నాస్టిక్‌ అసోసియేషన్‌ జనరల్‌ సెక్రెటరీ సాయాగౌడ్‌, జిల్లా ఖోఖో అసోసియేషన్‌ చైర్మన్‌ బిల్లా అనిల్‌, అధ్యక్షుడు భూమారెడ్డి, జనరల్‌ సెక్రెటరీ అతికుల్లా, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ నాగేశ్వరావు పాల్గొన్నారు.

అమ్మ చేతి వంటతో ఆరోగ్యానికి మేలు



తెయూ(డిచ్‌పల్లి): వంటిల్లే వైద్యశాల అని, అమ్మ చేతి వంట ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని కేంద్ర విద్యాశాఖ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ విద్యా మండలి, ఉన్నతి భారత్‌ అభియాన్‌ తెలంగాణ ప్రాజెక్టు ఆఫీసర్‌ బి శరత్‌చంద్ర నవీన్‌కుమార్‌ పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌-1, యూనిట్‌ -4 వలంటీర్లకు నిర్వహించిన 'సుపోషణ్‌' వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యవక్తగా హాజరయ్యారు. విద్యార్థులు రాగి జావ, సజ్జలు, కొర్రలు, మొలకలు, తాజా కూరగాయలు, జామకాయ, ఆపిల్‌, అరటిపండ్లు, డ్రైఫ్రూట్స్‌ తదితర ఆరోగ్యానికి మేలు చేసే పదార్థాలను తీసుకోవాలని సూచించారు. సుపోషణ్‌ కార్యక్రమ ప్రాముఖ్యత, విశిష్టతను శరత్‌చంద్ర నవీన్‌కుమార్‌ వివరించారు. ఆరోగ్యమే మహా భాగ్యమని చదువుతో పాటు ఆర్యోగంపై శ్రద్ధ చూపాలన్నారు. బయటి ఆహారానికి దూరంగా ఉండాలన్నారు. తెయూ ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ కే రవీందర్‌ రెడ్డి, ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ఆరతి, లా కాలేజీ ప్రిన్సిపాల్‌ కే ప్రసన్నరాణి, ప్రోగ్రాం ఆఫీసర్స్‌ బి స్రవంతి, ఎన్‌ స్వప్న పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం అడ్డగింత

- సీపీకి ఫిర్యాదు చేసిన ఈవో

నిజామాబాద్‌ సిటీ: నగరంలోని నీలకంఠేశ్వర ఆలయానికి చెందిన స్థలంలో దేవాదాయ శాఖ సిబ్బందిన చేపట్టిన ప్రహరీ పనులను గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకున్నారు.దీంతో సిబ్బంది అక్కడకు చేరుకోవగా వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆలయానికి చెందిన భూమి సాయినగర్‌(వర్నిరోడ్డు) ప్రధాన రోడ్డు పక్కన ఉండగా ఇద్దరు వ్యక్తులు కబ్జా చేసుకుని ఇంటి నిర్మాణం చేపట్టారు. పనులు బేస్‌మెంట్‌ లెవల్‌ వరకు పూర్తి అయ్యాక దేవాదాయ శాఖ అధికారులకు తెలిసి అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు.అనంతరం సిబ్బంది స్వయంగా పిల్లర్లను కూల్చివేశారు. రెండురోజుల క్రితం ఆ స్థలంలో దేవాదాయ శాఖ ప్రహరీ నిర్మాణం పనులు చేపట్టింది. ఈ పనులు చేస్తున్న కార్మికులను గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించటంతో కంఠేశ్వర్‌ ఆలయ ఈవో వేణు సీపీ కల్మేశ్వర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. పనులు జరుగుతున్న స్థలంలో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని ఈవోకు సీపీ సూచించారు.

మాట తప్పితే రాజీనామా చేస్తా

- పసుపు బోర్డుతో రైతులకు ఆర్థిక లాభం
- ప్రతి గ్రామంలో ఏడాదిలోపు ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తాం
- ఆర్‌ఆర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో రూపాయికే కార్పొరేట్‌ వైద్యం
- బీజేపీ ఆర్మూర్‌ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని, లేని పక్షంలో రాజీనామాకు వెనకాడనని బీజేపీ ఆర్మూర్‌ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. తాను గెలిచిన ఏడాదిలోపే ప్రతి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తానన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్‌ల సహకారంతో ఆర్మూర్‌ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తానని పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాకేశ్‌రెడ్డితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

–ఆర్మూర్‌



సాక్షి ఇంటర్వ్యూ

▶ సేవా కార్యక్రమాల గురించి చెప్పండి?

☛ రాజకీయాల్లోకి రాకముందే నా సతీమణి రేవతి రెడ్డి, కూతురు డాక్టర్‌ సుచరితరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఒక్క రూపాయికే వైద్య సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చాం. నియోజకవర్గ ప్రజల కోసం ఆర్మూర్‌లో సైతం ఆర్‌ఆర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఒక్క రూపాయికే కార్పొరేట్‌ వైద్యాన్ని అందించడానికి ఏర్పాట్లు చేస్తాం.

▶ యువత కోసం ఏం చేస్తారు?

☛ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక కష్టాలు పడుతున్న యువతను ఆదుకోవడానికి నావంతు కృషి చేస్తాను. అందులో భాగంగా నేను గెలిచిన ఏడాదిలోనే స్థానికంగా పరిశ్రమలను స్థాపించి ఐదు వేల మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తాను. అదేవిధంగా పేద విద్యార్థులు విదేశీ విద్యనందించడానికి తోడ్పాటు అందిస్తాం.

▶ రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఏం చేస్తారు?

☛ ఇప్పటికే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు ఎకరానికి రూ.ఆరు వేల పెట్టుబడి సహాయాన్ని అందిస్తోంది. 40 ఏళ్లుగా ఆర్మూర్‌ ప్రాంతంలో ఉన్న ప్రధానమైన డిమాండ్‌ పసుపు బోర్డు ఏర్పాటుకు ప్రధాన మంత్రి మోదీ చర్యలు చేపట్టారు. పసుపు బోర్డు ఏర్పాటైతే ఈ ప్రాంత పసుపు రైతులు గిట్టుబాటు ధరకు పంటను అమ్ముకొని ఆర్థికంగా లాభపడే పరిస్థితులు వస్తాయి

▶ ప్రస్తుత ఎన్నికల్లో ఇస్తున్న హామీలు ఏమిటి?

☛ నేను ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాదిలోనే నియోజకవర్గం పరిధిలోని ప్రతి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తాను. అర్హులైన వారికి ఈ ఇళ్లను కేటాయిస్తాము. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేస్తోంది.

▶ ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

☛ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనను ఆశిస్తున్న ఆర్మూర్‌ నియోజకవర్గ ప్రజలు బీజేపీ అభ్యర్థిగా నేను ప్రచారానికి వెళ్తే బ్రహ్మరథం పడుతున్నారు. కుటుంబ పాలనను అంతమొందించి అవినీతి లేని పాలన కోసం ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారు.

హాకీ క్రీడాకారుల ఎంపిక



ఆర్మూర్‌టౌన్‌: జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ప్రధానకార్యదర్శి సంగీతారావు ఆధ్వర్యంలో 67వ ఎస్‌జీఎఫ్‌ జిల్లా అండర్‌-14 హాకీ బాలబాలికల క్రీడకారుల ఎంపికను ఆర్మూర్‌ పట్టణంలోని మిని స్టేడియంలో సోమవారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నిర్వహించే ఉమ్మడి జిల్లాల సెలక్షన్స్‌లో పాల్గొంటారని సంగీతారావు తెలిపారు. పేటా సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశ్‌, జిల్లా హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి సురేందర్‌, హాకీ సంఘం సభ్యులు చిన్నయ్య, నాగేశ్‌, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేశ్‌, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ధర్నా

నందిపేట్‌: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నందిపేట మండల కేంద్రంలో కొల్‌పూర్‌ గ్రామస్తులు సోమవారం ధర్నా చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొల్‌పూర్‌కు చెందిన గొంగోటి సురేశ్‌(35) ఈనెల 11న బైక్‌పై నందిపేట సమీపంలోని తన పొలానికి వెళ్తుండగా, మండలంలోని తల్వేదకు చెందిన ఐరనాల రాజేశ్‌ అనే వ్యక్తి స్విఫ్ట్‌డిజైర్‌ కారులో వస్తూ ఢీకొట్టాడు. గాయాలపాలైన సురేశ్‌ను చికిత్సనిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 12న మృతి చెందాడు. సురేశ్‌ మృతికి కారణమైన రాజేశ్‌పై చర్యలు తీసుకొని బాధితకుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ కొల్‌పూర్‌ గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ కార్యకర్తల వాహనంపై దాడి

కామారెడ్డి రూరల్‌: కామరెడ్డి మండలంలోని గర్గుల్‌లో బీజేపీ కార్యకర్తలకు చెందిన తుఫాన్‌ వాహనంపై అటుగా ర్యాలీగా వెళ్తున్న బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు దాడి చేయడంతో అద్దాలు ధ్వంసం అయ్యాయి. కొందరు బీజేపీ కార్యకర్తలకు స్వల్పంగా గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం.. రామారెడ్డి నుంచి కొందరు బీజేపీ కార్యకర్తలు సోమవారం ఎల్లారెడ్డికి వెళ్తున్నారు. అదే సమయంలో గర్గుల్‌లో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ ర్యాలీ నడుస్తుంది. రోడ్డుపై రద్దీ ఎక్కువగా ఉండడంతో ఒక పక్కకు ఆపుకున్న బీజేపీ కార్యకర్తలకు చెందిన వాహనంపై ర్యాలీలోని కొందరు దాడి చేయడంతో అద్దాలు పగిలి అందులోని పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి దేవునిపల్లి పోలీసులు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కొందరు బీఆర్‌ఎస్‌ నాయకులు సదరు వాహనదరుడితో మాట్లాడి సముదాయించినట్లు తెలిసింది. ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.



ధ్వంసమైన వాహనం

క్రైం కార్నర్‌

నల్లవెల్లిలో వివాహిత ఆత్మహత్య



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు



స్నేహలత(ఫైల్‌)

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లిలో ఆదివారం రాత్రి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై మహేశ్‌, స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జగన్నాథచారితో నిజామాబాద్‌ నగరానికి చెందిన స్నేహలత(23)కు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి మూడేళ్లలోపు వయసున్న ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన స్నేహలత ఆత్మహత్యకు పాల్పడగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. సోమవారం అంత్యక్రియల అనంతరం స్నేహలత మృతికి అత్తింటి వారి వేధింపులే కారణమంటూ మృతురాలి బంధువులు ఆందోళన చేశారు. వారి ఇంటిపై దాడి చేసి వస్తువులను ధ్వంసం చేశారు. పోలీసులు జగన్నాథచారి కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకొని రక్షణ కల్పించారు. మృతురాలి తండ్రి రాజశేఖర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడు..

బాల్కొండ: అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది వరద కాలువలో దూకి మండలంలోని బోదేపల్లి గ్రామానికి చెందిన కోట శ్రీనివాస్‌(26) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. మెడికల్‌ చెకప్‌ కోసం శనివారం నిజామబద్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లిన శ్రీనివాస్‌ తిరిగి రాలేదు. దీంతో ఆదివారం పోలీస్‌ స్టేషన్‌లో మిస్సింగ్‌ కేసు కూడా నమోదైంది. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దుబాయిలో గుండెపోటుతో మృతి



సాయిలు(ఫైల్‌)

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన తిప్పలబోయిన సాయిలు (42) రెండు రోజుల క్రితం దుబాయిలో గుండెపోటుతో మృతి చెందాడు. సాయిలు 20 ఏళ్లుగా బతుకు దెరువు కోసం దుబాయికి వెళ్తు వస్తున్నాడు. ఏడాది క్రితం సెలవుపై వచ్చి వెళ్లాడు. మృతదేహం త్వరగా స్వదేశానికి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నాడు.

యువతి అదృశ్యం

డిచ్‌పల్లి: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. ఆ యువతి నిజామాబాద్‌ నగరంలో ప్రైవేట్‌ జాబ్‌ చేస్తోంది. సోమవారం ఉదయం విధులకు వెళ్తున్నాని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. కంగారు పడిన తల్లి ఎంక్వైరీ చేయగా ఆమె అసలు డ్యూటీకి రాలేదని తెలిసింది. ఆమె మొబైల్‌ కూడా స్విచ్ఛాఫ్‌ రావడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పేకాటస్థావరంపై దాడి

నస్రుల్లాబాద్‌: మండలంలోని నాచుపల్లిలో సోమవారం పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. వారి నుంచి రూ.1850 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నా కట్టె కాలేది బాన్సువాడలోనే..



నెమ్లిలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- అధికారం శాశ్వతం కాదు.. ప్రజలకు దగ్గరగా ఉండాలి
- బాన్సువాడ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



స్వాగతం పలుకుతున్న ప్రజలు

నస్రుల్లాబాద్‌: 'బీజేపీ, కాంగ్రెస్‌ అభ్యర్థులు స్థానికేతరులు.. నేను స్థానికుడిని.. నేను చనిపోతే నా కట్టె కాలేది బాన్సువాడ నియోజకవర్గం పోచారం గ్రామంలోనే' అని బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నెమ్లి, దుర్కి, బస్వాయిపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఆయనకు ప్రజలు బతుకమ్మలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నకు ధాన్యం పండించాలంటే పెట్టుబడి, కరెంటు, సాగునీరు, పండించిన ధాన్యం కొనడం జరగాలన్నారు. ఈ నాలుగు కేసీఆర్‌ పాలనతోనే సాధ్యం అవుతుందన్నారు. స్థానికంగా ఉండి ప్రజా సమస్యలను తీర్చడానికి పని చేస్తానన్నారు. అధికారం ఈ రోజు ఉంటుంది రేపు పోతుంది కానీ ప్రజా సేవ చేయడం గొప్ప వరమన్నారు. ప్రతి గ్రామంతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సారి కూడా కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు పెర్క శ్రీనివాస్‌, ఎంపీపీ పాల్త్య విఠల్‌, సర్పంచ్‌ గంగమణి, శ్యామల, ఎంపీటీసీ నాయిని రాధ, డి శ్రీనివాస్‌యాదవ్‌, కిశోర్‌యాదవ్‌, మాజీద్‌ ఖాన్‌, ప్రభాకర్‌రెడ్డి, సుధీర్‌బాబు, అంజాగౌడ్‌, నారాయణ, శంకర్‌ పాల్గొన్నారు.

రైతును ఇంధనదాతగా మారుస్తాం

- ఎల్లారెడ్డిలో ఇథనాల్‌ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాం
- కేంద్ర మంత్రి నితిన్‌ గడ్కరీ





మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నితిన్‌ గడ్కరీ, గడ్కరీని సన్మానిస్తున్న బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డి: దేశ ప్రజలకు ఆహారాన్ని సమకూరుస్తూ అన్నదాతగా ఉన్న రైతును ఇంధనదాతగా మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌ గడ్కరీ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలోని సీఎస్‌ఐ చర్చి మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను తీర్చేందుకు పలు రకాల ఉపాధి అవకాశాల కల్పనకు తమ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. ధాన్యం నూకలు, వరి పొట్టు ద్వారా ఇథనాల్‌ తయారు చేసే పరిశ్రమను అన్ని రంగాల్లో వెనకబడ్డ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇథనాల్‌తో వాహనాలకు అవసరమయ్యే సీఎన్‌జీ ఇంధనం తయారు చేయవచ్చని అన్నారు. వరి పొట్టు ద్వారా ఎరువులను, విమాన ఇంధనం తయారుచేసే పరిశ్రమలను కూడా ప్రోత్సహించి రైతులకు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్‌ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో దగా పడ్డ తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చడం బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. తాను గతంలో కేంద్ర నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంత ప్రజల సాగునీటి అవసరాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని గుర్తు చేశారు. తాము తయారు చేయించిన ప్రాజెక్ట్‌ డిజైన్‌ను కేసీఆర్‌ తనకు అనుకూలంగా మార్చి నేడు రైతులకు ఏ మాత్రం ఉపయోగపడని వ్యర్థ ప్రాజెక్ట్‌గా మార్చి వేశారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో కేసీఆర్‌ కుటుంబం మాత్రమే లాభపడిందన్నారు. కార్యకర్తలు పార్టీ అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా మారడం బీజేపీలోనే సాధ్యమవుతుందన్నారు. బీఆర్‌ఎస్‌లో కేసీఆర్‌ కుటుంబ సభ్యులకు తప్ప సామాన్య కార్యకర్తలకు గుర్తింపు లేదని ఆరోపించారు. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రిగా ఈ ప్రాంతంలో పలు జాతీయ రహదారులను మంజూరు చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లేందుకు రూ.3304 కోట్ల వ్యయంతో సంగారెడ్డి-నాందేడ్‌ ఎన్‌.హెచ్‌ 161 రోడ్డును మంజూరు చేశామని, అలాగే మద్నూర్‌-రుద్రూర్‌-భైంసా ఎన్‌ హెచ్‌ 161 బీబీ 100 కిలో మీటర్ల రోడ్డుకు రూ.1100 కోట్లను మంజూరు చేశామని తెలిపారు. మెదక్‌-ఎల్లారెడ్డి-రుద్రూర్‌ వరకు ఎన్‌ హెచ్‌ 765 డీ ద్వారా 96 కిలోమీటర్ల జాతీయ రహదారి కోసం రూ.900 కోట్లు మంజూరు చేశామన్నారు. వెనకబడిన ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జాతీయ రహదారులను ఏర్పాటు చేస్తే అభివృద్ధి చెందుతుందని బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డి చేసిన అభ్యర్థనను నెరవేరుస్తామని ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సుభాష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు బాణాల లక్ష్మారెడ్డి, మర్రి రామ్‌రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ కన్వీనర్‌ శ్రీరామ్‌, అసెంబ్లీ కన్వీనర్‌ లింగారావు, బాపురెడ్డి, మర్రి బాలకిషన్‌, దేవేందర్‌, బాలరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రచారాన్ని అడ్డుకున్న కాంగ్రెస్‌ కార్యకర్తలపై కేసు

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేట వారాంతపు సంతలో సోమవారం బీజేపీ కళాకారులు పాటలు పాడుతూ ఎన్నికల ప్రచారం చేస్తుండగా కాంగ్రెస్‌ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. బీజేపీ కళాకారులు పాటలు పాడుతూ ప్రచారం చేపట్టగా కాంగ్రెస్‌ కార్యకర్తలు ఇమామ్‌, గులాంతో పాటు మరికొంతమంది కాంగ్రెస్‌ కార్యకర్తలు బీజేపీ కళాకారులను అడ్డుకొని బెదిరించినట్లు బీజేపీ మండల నాయకుడు ధనుంజయ్‌ ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం



భిక్కనూరు: భిక్కనూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం వాహనాలను తనిఖీలో రూ.1.81లక్ష లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్‌ శనివారం తెలిపారు. నిర్మల్‌ పట్టణానికి చెందిన చిక్కెసీ రంజిత వాహనం తనిఖీ చేయగా రూ.1.01 లక్షలు, నిర్మల్‌ జిల్లా ముదోలుకు చెందిన యెర్రం మహేష్‌ వద్ద రూ. 80వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మద్యం సీసాలు..



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలం మత్తమాల, జంగమాయిపల్లి గ్రామాలకు చెందిన నలుగురు యువకులు 150 క్వార్టర్ల మద్యం సీసాలను తరలిస్తుండగా సీజ్‌ చేసినట్లు ఎస్సై గణేష్‌ సోమవారం తెలిపారు. పట్టణంలోని చెరువు కట్ట ప్రాంతంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తున్న వారి నుంచి సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తిమ్మాపూర్‌లో గుడిసె దగ్ధం



రోదిస్తున్న బాధితులు



కాలిపోయిన నగదు, సామగ్రి

గాంధారి: మండలంలోని తిమ్మాపూర్‌లో సోమవారం అగ్ని ప్రమాదంలో ఓ గుడిసె కాలిపోయింది. వివరాలు.. గ్రామానికి చెందిన పుట్టల చిన్ని గంగారాం దంపతులు పిల్లలను ఇంటి వద్ద ఉంచి చేనులో మొక్కజొన్న వేయడానికి వెళ్లారు. సాయంత్రం సమయంలో గుడిసెలో నుంచి మంటలు లేచాయి. గమనించిన గ్రామస్తులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కాని పొగ నిండిపోవడంతో సాధ్యం కాలేదు. అంతలోనే వంట గ్యాస్‌ సిలిండర్‌ పేలడంతో మంటలు బాగా వ్యాపించాయి. గ్రామస్తులు వస్తువులు బయటకు తీసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో బంగారు, వెండి ఆభరణాలతో పాటు దాచుకున్న నగదు, ఇంట్లోని సామగ్రి కాలిబూడిదయ్యాయి. అగ్ని మాపక కేంద్రానికి ఫోన్‌ చేసిన కలవకపోవడంతో సర్పంచ్‌ భర్త పరమేశ్వర్‌ రెడ్డి స్వయంగా వెళ్లి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైరింజన్‌ ఘటనా స్థలానికి చేరుకునే సరికి ఇళ్లు మొత్తం బూడిదైంది. ఆరు తులాల బంగారు నగలు, వెండి కడియాలు, పట్టీలతో పాటు నగదు, ఇతర సామగ్రి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. జెడ్పీటీసీ శంకర్‌ నాయక్‌, ఎంపీపీ రాధాబలరామ్‌ నాయక్‌, గాంధారి సర్పంచ్‌ సంజీవు, బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు శివాజీరావు, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ రెడ్డి రాజు బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

వెల్లుట్లపేటలో..



ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేటలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుడిసె దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలోని గోసల పోచయ్య గుడిసె కాలిపోవడంతో రెండు మాసాల బంగారం, 20 తులాల వెండి, బియ్యం తదితర వస్తువులు కాలిబూడిదైనట్లు బాధితులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి క్రైం: తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో పట్టపగలు చోరీ జరిగిన ఘటన కామారెడ్డి పట్టణంలోని రామారెడ్డి రోడ్‌లో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీ కాలనీకి చెందిన ప్లాట్ల నరేష్‌ ఫుట్‌వేర్‌ నడిపిస్తూ రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తున్నాడు. ఉదయాన్నే ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తాళం పగులగొట్టి అతని ఇంట్లోకి ఓ దొంగ చొరబడ్డాడు. సామాన్లన్నీ చిందరవందర చేసి బీరువాలోని 15 తులాల బంగారు ఆభరణాలు, రూ20 వేల నగదు ఓ బ్యాగులో వేసుకున్నాడు. అదే సమయంలో ఇంటికి వచ్చిన నరేష్‌ కొడుకు నవీన్‌ తాళం పగులగొట్టి ఉండటంతో లోపల ఎవరైనా ఉన్నారా అని గమనించాడు. దొంగ ఉన్నట్లు గుర్తించి పట్టుకోడానికి ప్రయత్నించాడు. నవీన్‌ రాకను గమనించిన దొంగ బ్యాగ్‌తో పాటు గోడ దూకి పరారయ్యాడు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. సీసీ ఫుటేజీలను, ఆధారాలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో నరేష్‌ తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద(జుక్కల్‌): అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నామని తహసీల్దార్‌ లక్ష్మణ్‌ తెలిపారు. శెట్లూర్‌, ఖద్గాం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అయ్యప్ప మందిరం వద్ద పట్టుకున్నామని చెప్పారు. తహసీల్‌ కార్యాలయానికి తరలిస్తుండగా అందులో ఒక ట్రాక్టర్‌తో డ్రైవర్‌ తప్పించుకున్నాడని పేర్కొన్నారు. మిగిలన రెండు ట్రాక్టర్లను మైన్స్‌ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. తప్పించుకున్న ట్రాక్టర్‌ డ్రైవర్‌ను పట్టుకుంటామన్నారు.



ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో భుజంగ్‌రావు

బాన్సువాడ రూరల్: ఓటు హక్కు దేశ సంక్షేమాభివృద్ధికి పునాది వంటిందని, ఓటును సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని బాన్సువాడ ఆర్డీవో భుజంగ్‌రావు అన్నారు. సోమవారం శ్రీరామ్ నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. దేశం, రాష్ట్రం, జిల్లా అభివృద్ధి పథంలో సాగి మనకు సుపరిపాలన అందాలంటే మంచి లక్షణాలున్న అభ్యర్థిని ఎన్నికల్లో ఓటు హక్కు ద్వారా ఎన్నుకోవాలన్నారు. అనంతరం ఇటీవల ఓటుహక్కుపై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో–ఆర్డినేటర్ శైలి బెల్లాల్, కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించండి

బాన్సువాడ: బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కుమార్తె అరుణావెంకట్‌రెడ్డి, కోడలు సోనీరెడ్డి ప్రచారం చేశారు. సోమవారం పట్టణంలోని ఎన్‌జీవోఎస్ కాలనీ, చైతన్యకాలనీల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల కోసం చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రమాదేవి, అనిత, ప్రతిమారెడ్డి తదితరులున్నారు.


ప్రచారం చేస్తున్న పోచారం కుమార్తె, కోడలు

బాన్సువాడ గడ్డ.. పోచారం అడ్డా

- ఎనిమిదోసారి ఎన్నికల బరిలో..
- ఒకేసారి ఓటమి


పోచారం శ్రీనివాస్‌రెడ్డి(బీఆర్‌ఎస్ అభ్యర్థి)

బాన్సువాడ: సీనియర్ నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీలో ప్రత్యేక స్థానం ఉంది. బాన్సువాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎనిమిదో సారి నామినేషన్ వేశారు. తన రాజకీయ జీవితంలో 1994, 1999, 2009లో టీడీపీ తరపున మూడు సార్లు, 2011 ఉప ఎన్నిక, 2014, 2018లో బీఆర్‌ఎస్ పార్టీ తరుపున వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించారు. 2004 ఎన్నికల్లో పెద్దాయనపై ప్రజల్లో సానుభూతి ఉన్నా అప్పుడు కాంగ్రెస్, వైఎస్ఆర్ హవా కారణంగా ఓటమిపాలయ్యారు. ఈసారి పోటీలో గెలిచి రికార్డు సొంతం చేసుకోవాలని భావిస్తున్నారు.

టీడీపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల హయాంలో సుముచిత స్థానం

1952లో బాన్సువాడ నియోజకవర్గం ఏర్పాటు నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలెవరికీ మంత్రి పదవులు దక్కలేదు. కానీ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి 1999 ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో కీలక మంత్రి పదవులు వరించాయి. టీడీపీ హయాంలో గృహ నిర్మాణ శాఖ, గనులు భూగర్భ శాఖ, పంచాయితీ రాజ్ శాఖల మంత్రిగా కొనసాగారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయ శాఖ మంత్రి పదవి లభించింది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న రోజుల్లోనే రైతు బంధు, రైతు బీమా పథకాలు పురుడుపోసుకున్నాయి. దీంతో అప్పటి నుంచి పోచారంకు సీఎం కేసీఆర్ లక్ష్మీ పుత్రుడిగా పేరు పెట్టారు.

కార్యకర్త స్థాయి నుంచి..

బాన్సువాడ మండలం పోచారం గ్రామానికి చెందిన పరిగె రాజిరెడ్డి–పాపమ్మల పెద్ద కుమారుడైన పరిగె శ్రీనివాస్‌రెడ్డి సాధారణ రైతు కుటుంబంలో పుట్టి పక్క గ్రామమైన ఇబ్రహీంపేట్, బాన్సువాడ, హైదరాబాద్‌లో విద్యనభ్యసించారు. హైదరాబాద్ కళాశాలలో చదువుతున్న రోజుల్లోనే కళాశాల ప్రెసిడెంట్‌గా చేశారు. అప్పట్లోనే బీటెక్ చదువుకున్నారు. 1990లో టీడీపీలో చేరి దేశాయిపేట్ సహకార సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వరుసగా రెండు సార్లు ఒకే సహకార సంఘం నుంచి అధ్యక్షులుగా గెలిస్తే సమితి అధ్యక్షులుగా పోటీ చేసేందుకు వీలుండదని, బాన్సువాడ మండలం బుడ్మి సహకార సంఘం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. దీంతో నిజామాబాద్ జిల్లా సహకార సంఘం చైర్మన్‌కు పోటీ చేశారు. అప్పటి సీఎం ఎన్‌టీఆర్ సహకారంతో డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి నేడు రాష్ట్ర స్థాయిలో కీలక పదవి వరకు ఎదిగారు.

1994లో తొలి విజయం..

1994 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీనాదేవిపై విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కిషన్ సింగ్‌పై భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2004లో అనుహ్యంగా ఆర్మూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్‌ను అధిష్టానం బాన్సువాడకు పంపిస్తే రాష్ట్రవ్యాప్తంగా టీడీపీపై ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత కారణంగా పోచారం స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌పై భారీ మెజార్టీతో విజయఢంకా మోగించారు. తర్వాత తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే పదవికి, టీడీపీకి రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరారు. 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌పై విజయం సాధించారు. తర్వాత 2014లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కాసుల బాల్‌రాజ్‌పై విజయం సాధించారు. అలాగే 2018లో అదే కాంగ్రెస్ అభ్యర్థి కాసుల బాల్‌రాజ్‌పై రెండో సారి పోచారం గెలుపొందారు. రాజకీయ అనుభవం కలిగిన పోచారంకు సీఎం కేసీఆర్ స్పీకర్ పదవి ఇచ్చి రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ఇవ్వని నిధులు, డబుల్ బెడ్ రూం ఇళ్లు బాన్సువాడకు ఇచ్చి పెద్దాయనకు గౌరవం ఇచ్చారు. తన రాజకీయ జీవితంలో మచ్చ లేని నాయకుడిగా పోచారం పేరు తెచ్చుకున్నారు. నిస్వార్థ రాజకీయాలకు తెరలేపారు. ఏ ఊరికి వెళ్లినా ఆ ఊళ్లో చాలా మందిని పేరుపెట్టి పిలిచే అంతటి జ్ఞాపకశక్తి పెద్దాయన ప్రత్యేకత. బాన్సువాడ అంటేనే పోచారం అడ్డా అనే విధంగా రాష్ట్ర స్థాయిలో బాన్సువాడ పేరును నిలబెట్టారు.

భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవం

- కంఠేశ్వర్ ఆలయంలో లక్ష దీపోత్సవము
- మారుమోగ్రిన శివ నామస్మరాలు
- దీపం వెలిగించిన ఎమ్మెల్సీ కవిత




నీల కంఠేశ్వరాలయంలో నిపోత్సవంలో పాల్గొన్న మహిళలు





నిజామాబాద్ సిటీ: కార్తీక మాసం తొలి సోమవారం కావటంతో ఉదయం 4 నుంచి ఆలయానికి భక్తుల తాకిడి మొదలైయ్యింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో వేలాది సంఖ్యలో మహిళలు వెలిగించిన దీపాలతో అడుగువేసే అవకాశం లేకుండా పోయింది.

భారత్ జాగృతి ఆధ్వర్యంలో లక్ష దీపోవత్సం

భారత్ జాగృతి నిజామాబాద్ శాఖ, తెలంగాణ బ్రహ్మణ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ నీలకంఠేశ్వర్ ఆలయంలో లక్ష దీపోత్సవము కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ కవిత ఈ కార్యక్రమానికి హాజరై కోనేరు వద్ద దీపం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్బంగా కోనేరు చుట్టూ దీపాలు వెలిగించటంతో ఆ ప్రాంతమంతా కాంతులు వెదజల్లాయి. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ నిజామాబాద్‌లో శ్రీ నీలకంఠేశ్వర్ ఆలయంలో కార్తీక దీపోవత్సంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఈ ఆలయానికి వచ్చి కార్తీకమాసంలో ఇక్కడ దీపాలు వెలిగించటం సంతోషంగా ఉంది. నీలకంఠేశ్వర్ స్వామికి కార్తీక మాసానికి మాకు ఎన్నోయేండ్ల నుంచి అనుబంధం ఉందన్నారు. కార్తీక మాసం సందర్బంగా అందరికి శుభం కలుగాలని కవిత అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, జాగృతి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ భరద్వాజ్, జిల్లా అధ్యక్షుడు అవంతిరావు, బ్రహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్ దేశ్‌ముఖ్, కోశాధికారి సురేష్ శర్మ, రమేష్‌కులకర్ణి, ఇందల్‌వాయి జడ్పీటీసీ గడ్డం సుమనారెడ్డి, జాగృతి మహిళ జిల్లా అధ్యక్షురాలు అపర్ణ, సభ్యులు రేఖా, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బిగాల కుటుంబ సభ్యుల ప్రచారం


గంగాస్థాన్‌లో ప్రచారం చేస్తున్న బిగాల గణేశ్‌గుప్తా సోదరీమణులు

నిజామాబాద్‌నాగారం: ఖలీల్‌వాడిలోని వెంకటసాయి అపార్టమెంట్, కేసీపీ, నీలకంఠేశ్వర అపార్టమెంట్‌లో సోమవారం బీఆర్‌ఎస్ అర్బన్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా సతీమణి లత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకి ఓటు వేసి గణేష్ బిగాలను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. అలాగే గంగస్థాన్ పృథ్వీ వసంత్ ప్రెస్టీజ్ పార్క్ అపార్ట్‌మెంట్, అశోక టౌన్‌షిప్‌లో బిగాల గణేష్ గుప్తా సోదరీమణులు వాణి, రాణిలు ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి, గణేశ్‌గుప్తాను గెలిపించాలని కోరారు. జగత్‌రెడ్డి, కెప్టెన్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సారెడ్డి, క్రిష్ణరెడ్డి, బలుసు వెంకటేష్, విజయ్, అమర్, చామకూర విశాలినిరెడ్డి, గరిపల్లి చంద్రబాగా, బిగాల జయ, బిగాల గౌతమి, కవిత, విజేత, సౌమ్య, సంగీత పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అర్బన్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా సతీమణి లత

లక్షలు వెచ్చించారు..
లక్షణంగా వదిలేశారు!

- టీబీ కార్యాలయంలో మూలనపడ్డ నూతన ఎక్స్‌రే మిషన్
- మూడేళ్లవుతున్నా నో ఇన్‌స్టాలేషన్
- డిప్యూటేషన్‌పై టెక్నీషియన్
- రోగులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు


ఇన్‌స్టాలేషన్‌కు నోచుకోని నూతన ఎక్స్‌రే యంత్రం


రిమ్స్‌లో ఎక్స్‌రే, స్కానింగ్ కోసం బారులు తీరిన రోగులు


ఆదిలాబాద్‌లోని టీబీ కార్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: క్షయ(టీబీ) నిర్మూలన కోసం ప్రభుత్వాలు లక్షలు వెచ్చిస్తున్నా అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. కొంతమంది వైద్యశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోగులకు సేవలు అందకుండా పోతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో టీబీ వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వం మూడేళ్ల క్రితం ఎక్స్‌రే మిషన్‌ను టీబీ ఆస్పత్రికి పంపించింది. ఓ టెక్నీషియన్‌ను నియమించింది. ఇక్కడ ఉండి విధులు నిర్వర్తించాల్సిన ఆ ఉద్యోగి రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతో తన సొంత జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నాడు. దీంతో నూతన ఎక్స్‌రే మిషన్ ఇన్‌స్టాలేషన్‌కు నోచుకోకపోవడం గమనార్హం. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది వైద్య ఆరోగ్యశాఖ అధికారుల దుస్థితి.

ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని వైనం..

జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆవరణలో టీబీ ఆస్పత్రి ఉంది. క్షయ వ్యాధి నిర్ధారణ కోసం రోజుకు పదుల సంఖ్యలో రోగులు ఇక్కడికి వస్తుంటారు. గతంలో రిమ్స్‌లో ఈ పరీక్షలు చేస్తుండగా, రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం మూడేళ్ల క్రితం టీబీ ఆస్పత్రికి సుమారు రూ.30 లక్షలు వెచ్చించి నూతనంగా ఎక్స్‌రే మిషన్ పంపించింది. అయితే అధికారుల అలసత్వం కారణంగా ఆ యంత్రం కాస్తా మూలనపడగా, రోగులు గతంలోలాగే రిమ్స్‌లో టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాల్సిన దుస్థితి. ఇక్కడ యంత్రం ఉన్నప్పటికీ టెక్నీషియన్ లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురవుతుందని తెలుస్తోంది. జిల్లాలో వేతనం తీసుకుంటూ ఇతర జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వైద్యారోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులందరి డిప్యూటేషన్లు రద్దయినప్పటికీ ఈయన మాత్రం హన్మకొండలోనే దర్జాగా విధులు నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇక్కడ రోగుల పరిస్థితి ఏమిటి..?

టీబీ ఆస్పత్రిలో రేడియోగ్రాఫర్‌గా పనిచేసే ఉద్యోగి ఉన్నతాధికారులతో పైరవీలు చేసుకొని ఏడాది కాలంగా హన్మకొండలో విధులు నిర్వహిస్తున్నట్లు ఆ కార్యాలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్‌లో టీబీ కార్యాలయం నుంచి వేతనం తీసుకుంటున్న ఆయన ఇక్కడ లేకపోవడంతో ఆ యంత్రం పనిచేయకుండా పోతోంది. ఆ ఉద్యోగిని టీబీ కార్యాలయానికి కేటాయించడంతోనే ప్రభుత్వం లక్షల విలువైన యంత్రాన్ని మంజూరు చేసింది. తీరా ఆయన డిప్యూటేషన్‌పై ఆయన సొంత జిల్లాకు వెళ్లడంతో ఇక్కడి రోగులకు సేవలు అందకుండా పోతున్నాయి. రిమ్స్ ఆస్పత్రిలో టీబీ నిర్ధారణ కోసం రోజుకు 20 నుంచి 30 మంది వరకు వస్తున్నారు. వీరందరిని ఎక్స్‌రే తీయించేందుకు అధికారులు రిమ్స్‌కు పంపిస్తున్నారు. దీంతో అక్కడ రద్దీ పెరిగి రోగులు అవస్థలు పడాల్సి వస్తోంది.

రేడియోగ్రాఫర్ డిప్యూటేషన్‌పై ఉన్నారు

టీబీ కార్యాలయానికి కేటాయించిన రేడియోగ్రాఫర్ ఏడాదికి పైగా డిప్యూటేషన్‌పై ఉన్నారు. ప్రస్తుతం ఆయన హన్మకొండలో విధులు నిర్వహిస్తున్నారు. టీబీ కార్యాలయానికి ప్రభుత్వం డిజిటల్ ఎక్స్‌రే మిషన్ మంజూరు చేసింది. త్వరలోనే ఇన్‌స్టాలేషన్ చేయిస్తాం. ప్రస్తుతం రోగులను ఎక్స్‌రే కోసం రిమ్స్‌కు పంపిస్తున్నాం.

– సాయిప్రియ, టీబీ ప్రోగ్రాం అధికారి, ఆదిలాబాద్

భక్తిశ్రద్ధలతో గోపాష్టమి


వేడుకల్లో పాల్గొన్న మార్వాడి సంఘు సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌లో రాధే రాధే ప్రభాత్‌భేరీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం గోపాష్టమి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మార్వాడి మహిళలు, పురుషులు రాధాకృష్ణ భవన్ నుంచి భజనలు, కీర్తనలతో గోశాలకు వెళ్లి అక్కడ కృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 56 రకాల నైవేద్యాలను గోవులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో మున్నా లడ్డా, ప్రదీప్ లడ్డా, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలి


జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులతో కలెక్టర్

నిర్మల్ రూరల్: క్రీడల్లో విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి వుషూ, కిక్ బాక్సింగ్ సెలక్షన్స్‌లో లోకేశ్వరం, భైంసా, కుభీర్ కేజీబీవీల విద్యార్థులు, బాసరలోని నాగభూషణం పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వారిని కలెక్టరేట్‌లో సోమవారం అభినందించారు. ఇందులో డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారి నఫీఖాన్, జీసీడీవో శ్రీదేవి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమణారావు, ట్రైనర్లు సాయికిరణ్, జితేందర్‌సింగ్, పీఈటీలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఉద్రిక్తత

- ఇరువర్గాల మధ్య తోపులాట


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

కౌటాల(సిర్పూర్): కుమురంభీం జిల్లా కౌటాల మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఉద్రిక్తతకు దారి తీసింది. ఆయా పార్టీల నాయకులు రోడ్ షో నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి హరీష్‌బాబు రోడ్‌షో మార్కెట్ ఏరియా నుంచి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతానికి ముందుగా చేరుకుంది. అనంతరం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప తనయుడు వంశీకృష్ణ రోడ్ షో అక్కడికి చేరుకుంది. ఇరుపార్టీల ప్రచార వాహనాల ఎదుట కార్యకర్తలు నృత్యం చేయడంతో బస్టాండ్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఒక దశలో ఇరువర్గాల మధ్యలో తోపులాట జరిగింది. సీఐ సాధిక్ పాషా, ఎస్సైలు మధుకర్, వెంకటేశ్, విక్రమ్ ఇరువర్గాలను శాంతిపజేసే ప్రయత్నం చేశారు. పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నరని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించారు. అనంతరం హరీశ్‌బాబు ప్రచార వాహనం అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఉద్రిక్తత చల్లారింది. పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారనే విమర్శలు వ్యక్తమయ్యాయి.

టోంకిని ఆలయానికి పోటెత్తనున్న భక్తజనం

- కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) వరకు మహాపాదయాత్ర
- వేలాదిగా తరలిరానున్న ప్రజలు



శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయం


ఆలయంలోని సిద్ధి హనుమాన్ విగ్రహం

సిర్పూర్(టి): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం టోంకినిలోని శ్రీసిద్ధి టోంకిని హనుమాన్ ఆలయానికి మంగళవారం భక్తజనం పోటెత్తనున్నారు. ఏటా కార్తీకమాసం రెండో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణం నుంచి సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా టోంకిని హనుమాన్ ఆలయం వరకు భక్తులు మహాపాదయాత్ర నిర్వహిస్తారు.

భక్తుల అపార నమ్మకం..

ఆలయంలో సిద్ధి హనుమాన్‌ను దర్శించుకుని ముడుపులు కడితే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల అపార నమ్మకం. దీంతో ఏటా కార్తీక మాసంలో కాగజ్‌నగర్ పట్టణంతో పాటు కౌటాల, బెజ్జూర్ మండలాలు, మంచిర్యాల, ఆసిఫాబాద్, బెల్లంపల్లి పట్టణాలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర పట్టణాలైన వీరూర్, గోండ్‌పిప్రి, అహెరి పట్టణాలతో పాటు గ్రామాల నుంచి వేలాది భక్తులు పాదయాత్రగా తరలివస్తారు.

భారీ బందోబస్తు...

కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో కౌటాల సీఐ సాదిక్ పాష, సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేశ్ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సిర్పూర్(టి)–కాగజ్‌నగర్, సిర్పూర్(టి)–కౌటాల ప్రధాన రహదారులతో పాటు ఆలయ సమీపంలో బారీకేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వంద మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ట్రస్టు సభ్యుడు జాబోర్ మారుతి తెలిపారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి టి.భీమేష్ మాట్లాడుతూ ఫీజుల పేరుతో ప్రిన్సిపాల్ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఫీజు చెల్లించకుంటే కళాశాలకు రావద్దంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారన్నారు. అకారణంగా తొలగించిన లెక్చరర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారానికి ప్రిన్సిపాల్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.